నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

3 | ఆదివారం 14 జనవరి 2024 | WARANGAL HANUMAKONDA


# ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ములుగు డీఏఓకు చోటు


అవార్డు అందుకుంటున్న గౌస్‌హైదర్

**కరౌకే సంగీతంలో 830 పాటల గానం**

**ఢిల్లీలో అవార్డు అందుకున్న గౌస్‌హైదర్**

ములుగు, జనవరి 13(నమస్తే తెలంగాణ) : కరౌకే సంగీతంలో విశేష ప్రతిభ చాటుతూ 830 పాటలను తనదైన రీతిలో పాడుతూ శ్రోతలను ఆహ్లాద పర్చుతున్న ములుగు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.ఏ.గౌస్ హైదర్‌కు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈమేరకు శనివారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీరజ చేతుల మీదుగా గౌస్‌హైదర్ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గౌస్‌హైదర్ మాట్లాడుతూ కరౌకే ట్రాక్‌లను ఉపయోగించి 830 పాటలను పాడటంతో పాటు 600 పాటలను ఎంపీ-3 ఫార్మేట్‌లో రికార్డు చేయించినట్లు తెలిపారు. పదేళ్ల నుంచి కరౌకే సంగీతంలో పాడుతున్న పాటల రికార్డులను ఆసియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థకు పంపగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

**భోగిపండ్లతో చిన్నారులకు దిష్టి**

**నేటి నుంచి మూడు రోజుల పండుగ**

**రంగవల్లులతో కళ కళ లాడనున్న ఇళ్లూవాకిలి**

**పలుచోట్ల గోదారంగనాథుల కల్యాణానికి ఏర్పాట్లు**

# భోగభాగ్యాల భోగి

## పీడల నివారణకు పాత వస్తువుల ఆహుతి

పుడమిపుత్రుల పండుగ.. సంబురాల సంక్రాంతి రానేవచ్చింది. నేడు భోగి, రేపు మకర సంక్రాంతి, ఎల్లుండి 'కనుమ'ను కన్నుల పండువగా జరుపుకొనేందుకు ప్రతి ఇల్లూ ముస్తాబైంది. సూర్యుడు దక్షిణాయణం నుంచి ఉత్తరాయణంలోకి అడుగిడే సంక్రాంతికి ముందు రోజున ఇంట్లో పాత వస్తువులు భోగి మంటల్లో వేస్తే పీడ తొలుగుతుందనీ, చిన్నారులకు భోగిపండ్లు పోసి దిష్టి తీస్తే ఆయురారోగ్యాలతో ఉంటారనీ ప్రతీతి. కాగా, జిల్లాలోని పలు ఆలయాల్లో నేడు నిర్వహించే గోదా రంగనాథస్వామి కల్యాణానికీ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 13

**మార్కెట్లో సందడి..**

ఈ మూడు రోజుల పాటు ప్రతి ఇంటి లోగిలీ ముత్యాల ముగ్గులతో కళకళలాడనుండగా, మార్కెట్లో రంగుల విక్రయాలు ఊపందుకున్నాయి. గొబ్బెమ్మల తయారీకి వాడే ఆవుపేడ, రేగు పండ్లు, బంతి పూలు, గరక పోచలు, మామిడి ఆకులను గ్రామీణులు తెచ్చి, అమ్ముతున్నారు. దీంతో ప్రధాన మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి.



**మూడు రోజుల పండుగ..**

సంక్రాంతి మూడు రోజుల వేడుక కాగా మొదటిరోజు భోగి. రెండో రోజు సంక్రాంతి. మూడోరోజు కనుమ నిర్వహించుకుంటారు. సూర్యుడి గమనానికి అనుగుణంగా జరుపుకొనే పండుగే సంక్రాంతి. హిందువుల ప్రతి పండుగలోనూ, చేసే పూజలోనూ ఏదో ఒక ఆంతర్యం దాగి ఉంటుంది. దక్షిణాయణం చివరి రోజుల్లో సూర్యుడు భూమికి దూరంగా ఉంటాడు. దీంతో సూర్యరశ్మి సరిగ్గా ఉండక, క్రిమికీటకాలు ప్రబలుతాయి. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంత మహిళలు పేడతో ఇళ్లను అలికి, సున్నపు పిండితో ముగ్గులు వేస్తారు. వీటి ప్రభావంతో వ్యాధికారక క్రిమికీటకాలు నశిస్తాయి. ముగ్గుల మీద పేడ ముద్దలుంచి, వాటికి పసుపు కుంకుమలు పెట్టి వివిధ పూలతో అలంకరిస్తారు. ఇవే గొబ్బెమ్మలు. హరిదాసుల హరినామస్మరణ, గంగిరెద్దుల విన్యాసాలు, వైష్ణవాలయాల్లో విష్ణు సహస్ర నామ పారాయణాలు వినిపిస్తాయి. భోగి రోజు గోదాదేవి కల్యాణాన్ని కమనీయంగా జరుపుకొంటారు. మకర సంక్రాంతి పిండివంటలు చేసి, భుజిస్తారు. కనుమ రోజు మినుములతో గారెలు వండి, పెద్దలకు నైవేద్యం పెట్టడంతో పాటు పశువులను పూజిస్తారు.

**గోదా కల్యాణం ఈ రోజే..**

దక్షిణాయణం దేవతలు నిద్రించే కాలంగా చెప్పుకుంటారు. దీంతో సంక్రాంతికి ఒక రోజు ముందు పీడ నివారణ కోసం వీధుల్లో భోగి మంటలు వేసి, ఇంట్లోని పాత వస్తువులను ఆహుతి చేస్తారు. మరుసటి రోజు నుంచి కొత్త వస్తువులు ఉపయోగించడం ఆనవాయితీ. భోగి రోజున తెల్లవారుజామున పిల్లలకు తలస్నానం చేయించి రేగు పండ్లు, చెరుకు ముక్కలు, అక్షింతలు కలిపి వారి తలలపై పోయడం వల్ల దృష్టి దోషం తొలగిపోతుందని పెద్దలు నమ్ముతారు. పెద్దల చేత భోగి పండ్లను పోయించడం వల్ల చిన్నారుల ఆయుష్షు పెరుగుతుందని ప్రతీతి. భోగి రోజే గోదాదేవి రంగనాథస్వామిని వివాహమాడిందని చెబుతారు. అప్పటి నుంచే ఆమె భోగభాగ్యాలు పొందిందని ప్రతీతి. భోగి రోజున మహిళలు వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో నింపి, వాటి మధ్య ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను పెడుతారు. వాటిపై గరక పోసలు ఉంచి, చుట్టూ నవధాన్యాలు, పళ్లు పోస్తారు. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవి తమ ఇళ్లలోకి వస్తుందని నమ్ముతారు.


ఆలయ ఆవరణలో బోనం సమర్పిస్తున్న భక్తులు

# ఐలోని మల్లన్నా శరణు శరణు..



ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచీ భక్తులు తరలివస్తుండడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోతున్నాయి. ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. నేడు భోగి పండుగ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రాతఃకాలం మేలుకొలుపుతో పూజలను ప్రారంభించనున్నారు.

**ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు షురూ**

**కాషాయ ధ్వజ పతాకం ఎగురవేత**

**పూజలు, అభిషేకాలు చేసి జాతరను ప్రారంభించిన వేదపండితులు**



ఐనవోలు, జనవరి 13 : ధ్వజారోహణంతో ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఒగ్గు పూజారులు స్వామి వారికి మేల్కొలుపు చేశారు. శైవాగమ పద్ధతిలో అర్చకులు ప్రాతఃకాలంలో విఘ్నేశ్వర పూజ, రుద్రాభిషేకం, నూతన వస్త్రాలంకరణ నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, శైవశుద్ధి పుణ్యాహవాచనం చేశారు. ఉత్సవ ప్రారంభ సూచికగా కాషాయ ధ్వజ పతాకలను చేతబూని మంగళవాయిద్యాలతో ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్చారణలతో మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ శిఖరం, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి గుడిపై ఎగురవేశారు. అనంతరం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహానివేదన నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఎద్దు సత్యనారాయణ, పోలెపల్లి బుచ్చిరెడ్డి, మార్నేని వెంకటేశ్వర్‌రావు, నునావత్ కీమానాయక్, మజ్జిగ రాములు, గడ్డం శ్రీనివాస్, జెట్టబోయిన శ్రీనివాస్, ఒగ్గుల మాధవి, తాటికొండ కృష్ణమూర్తి, చెరుకొండ వెంకటేశ్వర్లు, కొండేటి మమత, కూస చిరంజీవి, నాగబెల్లి మహేందర్, గురుమంచి వేణు గోపాలాచారి, వేదపండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జ్యోషి, అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్, అర్చకులు నందనం మధుశర్మ, పాతర్లపాటి నరేశ్‌శర్మ, నందనం భానుప్రసాద్, ఉప్పుల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది కిరణ్, మధుకర్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు. నేడు భోగి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రాతఃకాలం మేలుకొలుపుతో పూజలు ప్రారంభం కానున్నాయి.


విద్యుద్దీపాల వెలుగుల నడుమ భక్తజన సందోహంతో ఐలోని మల్లన్న ఆలయం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

**ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

పాలకుర్తి రూరల్, జనవరి 13 : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ము ఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అ ధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా నేటికీ రైతులందరికీ పంట పెట్టుబడి సాయం అందలేదని, రూ.2 లక్షల పంట రుణాల మాఫీ నెరవేరలేదన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అమలు కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు వంద రోజులు ఓపిక పడుతామన్నారు. అప్పటివరకు హామీలు అమలు చేయకుంటే ప్రజల తరపున పోరాటం చేస్తామని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలను, నాయకులను కంటికి రెప్ప లా కాపాడుకుంటానన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేస్తామని, ఎంత పెద్ద వారైనా సరే పార్టీ నియమావళికి విరుద్ధంగా ప్రవరిస్తే సహించేది లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీ నాయక్, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ దార శారదాశంకరయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, బొమ్మగాని కొమురయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, శివరాత్రి సుధాకర్, కారుపోతుల వేణు, పాము శ్రీనివాస్, కమ్మగాని నాగన్న, గర్వందుల మల్లేశ్, సంపత్ శ్రీపాల్‌రెడ్డి, పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పెయింటింగ్ చేసి వస్తూ..

- చెట్టును ఢీకొట్టిన బైక్.. ఇద్దరు యువకుల మృతి
- తాడ్వాయి మండలం బంజర ఎల్లాపురంలో ప్రమాదం


పోతుగంటి వంశీ (ఫైల్)


ఎల్తూరి పవన్ (ఫైల్)

తాడ్వాయి/శాయంపేట, జనవరి 13 : బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం బంజర ఎల్లాపురం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన కొందరు తాడ్వాయి మండలకేంద్రంలోని పీఏసీఎస్ నూతన భవనానికి పెయింటింగ్ వేసేందుకు వ చ్చా రు. శుక్రవారం సాయంత్రం పనులు ము గించుకుని పోగంటి వంశీ(23), ఎల్తూరి పవన్(22), మామిడి భాస్కర్ బైక్‌పై మండలంలోని గంగారం గ్రామానికి వ్యక్తిగత పని మీద వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో బంజర ఎల్లాపురం సమీపంలోకి రాగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన వంశీ, పవన్ అక్కడికక్కడే మృతిచెందగా, భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు గమనించి అతడిని 108 వాహనంలో ములుగు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, తమకు న్యాయం చేయాలని పత్తిపాకలోని కాంట్రాక్టర్ పోతుగంటి సుధాకర్ ఇంటి ముందు మృతదేహాలతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పత్తిపాక-శాయంపేట ప్రధాన ర హదారిపై బైఠాయించారు. సీఐ మల్లేశ్, ఎస్సై దేవేందర్ వారికి సర్ది చెప్పడంతో ఆందోళన విర మించారు. పవన్, వంశీ కుటుంబాల్లో ఒక్క కొడుకులే కావడంతో ఆయా తల్లి దండ్రుల రోదనలు మిన్నంటాయి.


కాంట్రాక్టర్ ఇంటి ఎదుట మృతదేహాలతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

# గృహలక్ష్మి బిల్లులు చెల్లించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెల్లడి
- ఇందిరమ్మ పథకంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, జనవరి 13 : గృహలక్ష్మి లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని, పరకాల నియోజకవర్గానికి 3వేల ఇండ్లను మంజూరు చేసిందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను గుర్తించి మంజూరు పత్రాలను అందించగా, పలువురు పాత ఇళ్లను కూల్చి వేసి నూతన ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల చెల్లించలేదని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేయడంతో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు ఆందోళన చెందుతున్నారన్నారు. కాగా, గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ వేయగా, బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించినట్లు చల్లా పేర్కొన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన సుమారు 500మందికి బిల్లులను చెల్లించడంతో పాటు మిగిలిన లబ్ధిదారుల జాబితాతో నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు.

# చివరి చూపు కోసం ఎదురుచూపులు

**పోలండ్‌లో హనుమకొండవాసి మృతి**

**ఈ నెల 15న స్వస్థలానికి చేరనున్న మృతదేహం**


క్రాంతికుమార్(ఫైల్)

హనుమకొండ చౌరస్తా, జనవరి 13 : హనుమకొండ మచిలీ బజార్‌కు చెందిన రావుల క్రాంతికుమార్(39) ఇటీవల పోలండ్ దేశంలో మృతిచెందగా.. చివరి చూపు కోసం అతడి కుటుంబసభ్యులు 19 రోజులుగా ఎదురుచూస్తుండడం కలచివేస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీబజార్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ రావుల వనజ-సుదర్శన్‌కు ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. పెద్దకొడుకు క్రాంతికుమార్(39) కంప్యూటర్ సైన్స్ చేసి పోలండ్‌లోని ఓ కంపెనీలో 16 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. గతేడాది హనుమకొండకు వచ్చిన ఆరు నెలల క్రితం తిరిగి వెళ్లాడు. అనారోగ్య సమస్యతో బాధపడుతూ గత నెల డిసెంబర్ 26న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బోరున విలపిస్తూ కడచూపు కోసం ఎదురుచూస్తున్నారు. అతడికి భార్య సరిత, కొడుకు విద్వాన్ ఉన్నాడు. అయితే 15న మృతదేహం ఇంటికి రానుండగా ఉదయం 10 గంటలకు పద్మాక్షి శివముక్తిధామ్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, అభినవ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు పులి రజినీకాంత్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# మంత్రి సురేఖ సంక్రాంతి శుభాకాంక్షలు

ఖిలావరంగల్, జనవరి 13: తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంతా సంక్షేమంతోపాటు అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలని, భోగభాగ్యాలను అందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, వరంగల్ జిల్లా ప్రజలకు కలెక్టర్ పీ ప్రావీణ్య సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.